

ఎంహెచ్ఓగా డాక్టర్ ఎస్.రమేష్

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరపాలక సంస్థ ఎంహెచ్ఓగా డాక్టర్.ఎస్.రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డిఎంఅండ్‌హెచ్ఓ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రస్తుత పరిస్థితిని బట్టి వాతావరణంలో మార్పులు ఉన్నందువల్ల సీజనల్ వ్యాధులపై దృష్టి సారించి దోమలు నివారణ చర్యలు చేపడతామన్నారు. కడప నగరపాలక సంస్థ పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయని, 1,241 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఉన్న కార్మికులతో నగరాన్ని శుభ్ర పరిచి నగరాన్ని తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నగరాన్ని రోజూ ఉదయాన్నే వీధివీధి తిరిగి కార్మికులు ఎలా పనిచేస్తున్నారో పరిశీలించి వారికి తగు సూచనలు అందిస్తానని పేర్కొన్నారు. కమిషనర్ మనోజ్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది సహకారంతో కడపను క్లీన్, గ్రీన్ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు.

వ్యవసాయంలో కడప, అన్నమయ్యకు సి గ్రేడ్

- హార్టీకల్చర్‌లో లింగాల ప్రస్తావన
- పారిశ్రామిక, సర్వీసులూ అంతంతే
- విజయవాడలో సిఎం విజన్-2047 సమీక్ష

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా తలసరి ఆదాయం (జిడిపి) వృద్ధిని పెంపు ఆధారంగా ప్రభుత్వం కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహిస్తోంది. వ్యవసాయం, పారిశ్రామికం, సర్వీస్ రంగాలవృద్ధి ఆధారంగా లభించిన తలసరి ఆదాయాన్ని గణన చేస్తారు. స్వర్ణాంధ్ర విజన్-2047 నాటికి కడప జిల్లా వ్యవసాయ, పారిశ్రామిక, సర్వీస్ రంగాల నుంచి తలసరి ఆదాయం రూ.63,47,871 కోట్లు నుంచి రూ.54,60,748 కోట్లకు పెంచాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకెళ్తోంది. పారిశ్రామిక, సర్వీస్ సెక్టార్లలో అసాధారణ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహిస్తున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధి తొలిక్వార్టర్‌లో కడప, అన్నమయ్య జిల్లాలు హార్టీకల్చర్ మినహా మిగిలిన పారిశ్రామిక, సర్వీస్ రంగాలు సాధించిన స్కోర్లలో ఆశించిన పురోగతి కనిపించ కపోవడం ఆందోళన కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లా వ్యవసాయ రంగంలో రూ.48,677 కోట్లు సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. 17.42 శాతం సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తొలిక్వార్టర్‌లో రూ.9,960 కోట్లు సాధించాలనే లక్ష్యానికి గానూ20.46 శాతం సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. కడప జిల్లాలో రూ.73,217 కోట్ల లక్ష్యానికి గాను 18.16 శాతం వృద్ధిరేటు సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. ఈఏడాది తొలి క్వార్టర్‌లో రూ.13,149 కోట్ల ఆర్జన లక్ష్యానికి 17.96 శాతం సాధించాల్సి ఉంది. స్వర్ణాంధ్ర జిల్లాల స్కోర్లలో కడప జిల్లా 62 స్కోర్లతో బి గ్రేడ్, అన్నమయ్య జిల్లా 59 గ్రేడ్లతో బి గ్రేడ్ సాధించింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో కడప జిల్లా 27 స్కోర్లతో సి గ్రేడ్, అన్నమయ్య జిల్లా 25 స్కోర్లతో సి గ్రేడ్‌కు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. సహకరించే అంశాలు, వృత్తాకారం పాయింట్ల ఆధారంగా లింగాల మండలంలోని కోమన్నూతల గ్రామం అనుకూలతలు కలిగినదిగా గుర్తింపు దక్కించుకుంది. పంటలు మొదలుకుని ప్రతితాత్వరకు జివిఎను కలిపి లెక్కించడం గమనార్హం. వీటితో పాటు మైనింగ్, క్వారీయింగ్, తయారీరంగం, విద్యుత్, నీటి సరఫరా నిర్మాణం తదితర పారిశ్రామిక రంగాల క్వార్టర్ వారీ వృద్ధిని జివిఎను కలిపి లెక్కించారు. ఇండస్ట్రీ సెక్టార్‌లో అన్నమయ్య జిల్లా 80 స్కోర్లతో ఎగ్రేడ్, కడప జిల్లా 42 స్కోర్‌తో సిగ్రేడ్‌కు పరిమితమైంది. సర్వీస్ సెక్టార్‌లో కడప జిల్లా 76 స్కోర్‌తో ఎగ్రేడ్, 68 స్కోర్ రేటింగ్‌తో బి.గ్రేడ్‌కు పరిమితమైంది.



సిఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

పిఎస్ నగర్ అభివృద్ధికి పోరాడుదాం

- ప్రతి కుటుంబానికీ పొజిషన్ సర్టిఫికేట్ ఇవ్వాలి
- తక్షణం శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి
- మౌలిక వసతులు కల్పించాలి
- తహశీల్దార్ ఆఫీస్ ఎదుట మహాధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, పిఎస్ నగర్ ప్రజలు

ప్రజాశక్తి-గోపవరం

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులోని పుచ్చలపల్లి సుందరయ్య నగర్ అభివృద్ధికి పోరాడుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పిఎస్ నగర్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గోపవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ముందుగా మండలంలోని సిద్ధమ్మ పేరంటాల నుంచి తహశీల్దార్ తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రతిపక్ష నాయకులు, కమ్యూనిస్టు గాంధీగా పిలవబడ్డ పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో 2001 డిసెంబర్‌లో భూపోరాటం సందర్భంగా దిగొచ్చిన ప్రభుత్వం 3చ600 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిందని చెప్పారు. కానీ ఇంతవరకు పిఎస్ నగర్‌లోని ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు పూర్తిగా అందడం లేదన్నారు. పిఎస్ నగర్ అభివృద్ధి కోసంప్రజలందరూ పోరాటమార్గా నేర్చుకోవాలని, పాలకులు, అధికారుల పై ప్రజా ఉద్యమ ఒత్తిడి పెరిగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అధికారంలోకి ఏ రాజకీయ పార్టీ వచ్చినా రాజకీయాలకు అతీతంగా ప్రజాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని దానికి భిన్నంగా బద్వేల్ నియోజకవర్గంలో అధర్మం నాలుగు పాదాలపై ఉందని విమర్శించారు బద్వేల్ పట్టణంలోని జనాభాలో 30 శాతం కమ్యూనిస్టులు వేసిన కాలనీలలో జీవిస్తున్న వాస్తవాన్ని పాలకులు, ఉన్నతాధికారులు గమనించాలన్నారు. ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే జవాబుదారీతనం లేకపోతే పాలక ప్రతిపక్ష పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. గోపవరం తహశీల్దార్ త్రిభుషన్ రెడ్డికి ప్రజలు ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం దరఖాస్తు చేశారు. నెలరోజులలోపే దరనఖాస్తులను ఆన్‌లైన్ చేసి సర్వేకు పంపుతామని తహశీల్దార్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో బద్వేల్ పట్టణ సిపిఎం కార్యదర్శి కె. శ్రీను, పట్టణ కమిటీ సభ్యులు ఎం.చిన్ని, బాబు, శివ, సుబ్బ రాయుడు, మోక్షమ్మ, కైరన్ బి, శాఖా కార్యదర్శులు కొండయ్య, బాలమ్మ, మస్తాం బి, పార్టీ కార్యకర్తలు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, పద్మ, ఫాతిమా, బాలస్వామి, మాధవి, చంద్రకళ, కృష్ణవేణి, రమాదేవి, సిద్ధమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- అంగన్వాడీ 9వ జిల్లా మహాసభలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి



మహాసభలో మాట్లాడుతున్న బి.లక్ష్మీదేవి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, ఐక్య పోరాటాలతోనే అంగనవాడీల సమస్యలు పరిష్కారం అవుతాయని అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి పేర్కొన్నారు. సోమవారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా 9వ మహాసభలు స్థానిక యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించారు. మహాసభల ప్రారంభంలో యూనియన్ నాయకులు ఆర్.లక్ష్మీదేవి జెండా ఆవిష్కరించారు. అనంతరం భాగ్యమ్మ, అంజలీదేవి అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. పేదవారి సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అంగన్వాడీలు విపరీతమైన పని భారాన్ని మోస్తున్నారని చెప్పారు. తక్కువ వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు శ్రీనివాసరెడ్డి, బి.మనోహర్ మాట్లాడుతూ వేతనాల పెంపు కోసం ఐక్య పోరాటమే మార్గమని పేర్కొన్నారు. 42 రోజుల పాటు అంగన్వాడీలు సమ్మె చేసినప్పుడు ప్రస్తుత కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఉండి మద్దతిచ్చారని గుర్తు చేశారు. సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీలు ఇప్పుడు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి నివేదికలో మూడేళ్లలో జరిగిన పోరాటాలు చర్చించారు. 42 రోజుల సమ్మె ఫలితంగా అనేక జిఒలు సాధించుకున్నామని తెలిపారు. రాబోయే కాలంలో జిల్లాలో ఉద్యమాన్ని మరింత బలపర్చాలని చెప్పారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆర్.లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, జిల్లా కోశాధికారి ఎం.పి. అంజనాదేవి, మరో 53 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.సత్య నారాయణ, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విషజ్వరాల నియంత్రణకు చర్యలేవి? : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలో వర్షాలు పడడంతో సీజనల్ వ్యాధులు మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాలు విజృంభిస్తున్నాయని, నగరంలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని, డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సిపిఎం కడప నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ తెలిపారు. సోమవారం కడప అక్కాయపల్లిలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సిపిఎం నగర కమిటీ ప్రతినిధి బృందం పరిశీలించి అక్కడ ఉన్న రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వర్షాలు పడుతుండడంతో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉందని, దోమలు విపరీతంగా ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ కూడా లేకపోవడంతో దోమల నివారణకు ఫాగింగ్ కూడా సరిగా చేయలేదని చెప్పారు. ప్రయివేట్ ఆసుపత్రులలో వేలాది రూపాయలు ఫీజుల భారం భరించలేక పట్టణ ఆరోగ్య కేంద్రాలకు రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. డాక్టర్లు మధ్యాహ్నం వరకు మాత్రమే ఆసుపత్రిలో ఉంటున్నారని, తరువాత అందుబాటులో ఉండడం లేదని వాపోయారు. విష జ్వరాలపట్ల పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు నిర్లక్ష్యం చేస్తే డిఎంహెచ్ఒ ఆఫీస్ ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పర్యటనలో సిపిఎం నాయకులు దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు. **ప్రభుత్వ స్థలాలను కాపాడండి..** నగరంలోని వైజంక్షన్ దగ్గర ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది భూ కబ్జాదారులు ఆక్రమించుకోవడాన్ని నిరసిస్తూ సిపిఎం నాయకులు సోమవారం కబ్జా గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ మాట్లాడుతూ కడప నగరంలో కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని పేర్కొన్నారు. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని చెప్పారు. వై జంక్షన్ దగ్గర ఉన్న 9 సెంట్ల స్థలం రూ.5 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని యధేచ్ఛగా కబ్జా చేస్తుంటే రెవెన్యూ యంత్రాంగం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలు పరిరక్షించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పేదలకు స్థలాలు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. పర్యటనలో సిపిఎం జిల్లా నాయకులు సత్యనారాయణ చారి, దస్తగిరి రెడ్డి, నగర కమిటీ నాయకులు చంద్రారెడ్డి, విశ్వనాథ్, నరసింహ, సిపిఐ మహిళా సంఘం నాయకులు భాగ్యమ్మ పాల్గొన్నారు.

అర్హులకు భూమి, ఇంటి స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-అట్లూరు : అర్హులైన పేదలకు వ్యవసాయ భూమితోపాటు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. చాంద్‌బాషా, మండల కార్యదర్శి ఇ. రమణయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ సుబ్బలక్ష్మమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు వందలాది ఎకరాలు ఉన్నాయని, వాటిని అర్హులైన వారికి పంపిణీ చేయాలని కోరారు. ముఖ్యంగా గుజ్జులవారిపల్లి, దేవనగర్, ఉప్పుటూరు, ఎస్. వెంకటాపురం,తుడూరు, చండువాయి, మలినేనిపట్నం, మద్దూరు, చెన్నేపల్లి, బెడుసుపల్లి, కోమానుపల్లి, రంగంపల్లి, అట్లూరు మండలంలో ఉన్న అర్హులైన పేదలందరికీ వ్యవసాయ భూమి ,ఇంటి స్థలాలు ఇవ్వాలని చెప్పారు. తహశీల్దార్ స్పందిస్తూ అర్హులైన ప్రజలందరికీ తప్ప కుండా వ్యవసాయ భూములు ఇంటి స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు దుర్గమ్మ, స్వప్న, సరస్వతి ,ఆదిలక్షమ్మ, సంధ్య, రవిచంద్ర, రామ సుబ్బయ్య, ఎల్లయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ఓటు దొంగతనంపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కడప

ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగ రక్షణకు కాంగ్రెస్ పార్టీ ఓ సంపూర్ణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ తెలిపారు. కడపలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం, భారతీయ జనతా పార్టీ కుమ్మక్కై ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్న నేపథ్యంలో ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు వరకు 'ఓటు దొంగ - గద్దె దిగు' అనే నినాదంతో భారీగా సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించినట్లు వివరించారు.

భారతీయుల ఐక్యత శక్తి హిందీ

- ఎల్ఐసి ఎస్‌డిఎం రవికుమార్

ప్రజాశక్తి- కడప అర్బన్

భారతీయులందరినీ ఐక్యంగా ఉంచే బలీయమైన శక్తి హిందీ అని ఎల్ఐసి కడప సీనియర్ డివిజన్ మేనేజర్ జి.కెఆర్.వి రవికుమార్ అన్నారు. సోమవారం ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో 2025 సంవత్సర హిందీ పక్షోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార భాషగా హిందీకి 76 సంవత్సరాల చరిత్ర అన్నారు. ఈ సుదీర్ఘ కాలంలో హిందీ అధికార భాషగా మన జాతి అస్థిత్వానికి జయప్రదంగా ప్రాతినిధ్యం వహించిందని తెలిపారు. ఒక ప్రభుత్వ రంగ సంస్థగా ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో కార్యాలయ నిర్వహణలో, ఉత్తర ప్రత్యుత్తరాలలో, కార్యకలాపాలలో తాము హిందీ వినియోగం వంద శాతం చేస్తున్నామని చెప్పారు. హిందీని ప్రేమించాలని, గౌరవించాలని, ఆదరించాలని ఎల్ఐసి చెయిర్ పర్సన్ ఆర్. దొరై స్వామి పిలుపు తమకు శిరోధార్యమని పేర్కొన్నారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పక్షంలో ఉద్యోగులకు నిర్వహించే హిందీ సంబంధిత పోటీలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు హరేంద్ర, రమేష్ బాబు, జి.బాబు పాల్గొన్నారు.


నేడు చెన్నూరు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- చెన్నూరు : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 16న ఉదయం 10:30 గంటలకు మండల సభా భవనంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కిరణ్ మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. తగిన సమాచారంతో అధికారులు రావాలన్నారు. సమావేశంలో ప్రాథమిక విద్యాశాఖ, ఆర్‌బికె, గృహ నిర్మాణం, వ్యవసాయ శాఖ, పశు వైద్య శాఖ, నాడు- నేడు, ఎపిఎస్ఆర్‌టిసి పైన, గ్రామీణ తాగునీరు, పారిశుధ్యంపై సమీక్ష ఉంటుందన్నారు.

రిమ్స్ పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కడప సిటీ

కడప నగర శివారులోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో పీజీ చేస్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులకు వివిధ కేటగిరీలలో బహుమతి సాధించారు. సోమవారం తమ ఛాంబర్‌లో సోమవారం ప్రిన్సిపల్‌డాక్టర్ టి.జమున వారికి ప్రత్యేకంగా అభినందించారు. కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈనెల 12,13,14 తేదీల్లో నిర్వహించిన 7వ ఎపిఎం ఎపి స్టేట్ కాన్ఫరెన్స్‌లో కడప ప్రభుత్వ వైద్య కళాశాల పెథాలజీ మొదటి సంవత్సరం పీజీ విద్యార్థిని డాక్టర్ వి. జె ఆర్ష తమ గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ డి కళ్యాణి మార్గదర్శకత్వంలో ప్రజెంట్ చేసిన పోస్టర్‌కు మొదటి బహుమతి లభించింది. అలాగే మంగళగిరి ఎయిమ్స్‌లో ఈనెల 13,14 తేదీలలో ఎపి ఎఆర్ ఒఐసిఒఎన్‌బి-2025 రాష్ట్ర రేడియేషన్ ఆంకాలజిస్టుల సదస్సులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల చెందిన ద్వితీయ సంవత్సరం రేడియేషన్ ఆంకాలజిస్ట్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థిని డాక్టర్ బి సుధేష్ణ ఆమె గైడ్ డాక్టర్ ప్రవీణ మార్గదర్శకత్వంలో చేసిన ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి అందుకున్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

పోలీస్ శాఖ పట్ల నమ్మకం కల్గిస్తాం

అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తాం

నూతన ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన నచికేత్ విశ్వనాథ్

ప్రజాశక్తి - కడప అర్బన్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌పి నచికేత్

జిల్లాలో పోలీస్ శాఖ పట్ల ప్రజలలో మరింత నమ్మకం పెంపొందించేలా శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎస్‌పి చేపట్టిన షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలతో ఎస్‌పి గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జిలా లో ఎస్‌పి గా విధులు నిర్వర్తించే అవకాశం రావడం సంతోషంగా ఉందని చెప్పారు.అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి, డిజిపికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అధికారులు, మీడియా, ప్రజల భాగస్వామ్యంతో డ్రగ్స్, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చాలా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

జిల్లాలో ప్రజా సమస్యలపై పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని, అలసత్వం ఉండరాదని ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కడప సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, ఇతర ప్రత్యేక విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను అధ్యయనం చేసి శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే పోలీస్ అధికారులపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపుఎస్‌పి (ఎస్‌పి) బి.రమణయ్య, కడప డిఎస్‌పిఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కడప



మోక్షగుండం చిత్రపటానిక నివాళులర్పిస్తున్న డిఆర్‌ఒ

సమాజ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పనలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకమని, వారి సేవలు భావితరాలకు ఎంతో అవసరం అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సభా భవన్‌లో జిల్లా గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంజినీర్స్ డే వేడుకలకు జిల్లా డిఆర్‌ఒ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా ప్రార్థనా గీతం, జ్యోతి ప్రజ్వలన చేసి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలదండవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములైన ఇంజినీర్స్ అందరికీ ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు, నీతి ప్రపంచ ఖ్యాతి పొందాయన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారిని ఆదర్శంగా తీసుకొని దేశఅభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలన్నారు. అనంతరం ఇంజనీర్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు హౌసింగ్ శాఖ తరుపున ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ తోపాటు పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఇంజనీరింగ్ సహాయక సిబ్బంది పాల్గొనారు.

ఎంఆర్‌పి ధరకే యూరియా విక్రయించాలి

ప్రజాశక్తి - కడప : ఎటువంటి షరతులు లేకుండా రైతులకు తక్షణమే యూరియాను పంపిణీ చేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పిసిసి, డిసిసి అధ్యక్షులు ఆదేశాల మేరకు కిసాన్ సెల్ అధ్యక్షుడు గంట చిన్న రామిరెడ్డి ఆధ్వర్యంలో యూరియా కొరతపై సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిన్న రామిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, జిల్లా జనరల్ సెక్రటరీ గౌస్ పీర్, కమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఎరువుల మళ్లింపును అడ్డుకోవాలని వారు స్పష్టం చేశారు.

భారీ స్కోరు దిశగా అనంతపురం

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్- 23 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎస్టేడియంలో అనంతపురంచ కడప జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 364 పరుగుల భారీ స్కూల్ సాధించింది. ఆ జట్టులోని మహేంద్ర రెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించి 142 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. వికాస్ 85 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. కడప జట్టులోని ఎస్ఎండి ఆయుబ్, చెన్నారెడ్డి, నరసింహలు ఒక్కో వికెట్ తీసుకున్నారు. కె ఎస్ ఆర్ ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో ఆట ముగిసే సమయానికి 89.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 375 పరుగులు చేసింది. ఆ జట్టులోని నికిత్ గౌడ్ 110 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. కర్నూలు జట్టులోని కనీష్ నాలుగు, సాయి సూర్యతేజారెడ్డి రెండు వికెట్లు తీసుకున్నారు.



తలపడుతున్న కడప-అనంతపురం జట్లు



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు అనుబంధ సంఘాల నేతలు

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వాసుపత్రుల్లో, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్‌కు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇవ్వాలని ఆప్కాస్ గౌరవ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్ కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలోని ఎఒ ఇక్బాల్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వారి ఏజెన్సీ వారు కాలం గడుపుతున్నారన్నారు. ఏజెన్సీ పెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇదే విషయాన్ని గత నెలలో ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. అయినా ఆ ఏజెన్సీ వారు కార్మికులకు ప్రతినెలా వేతనాలు వేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సేవా, సుప్రీమ్, ఈగల్ వంటి ఏజెన్సీలను రద్దుచేసి కొత్త ఏజెన్సీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు శేఖర్, నాయకులు మధు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిలో రమాదేవి అత్యంత ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు



మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన మార్తల రమాదేవి ప్రభుత్వం నిర్వహించిన మెగా డిఎస్‌సిలో అత్యంత ప్రతిభ కనబరిచారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. డిఎస్‌సిలో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్ల విభాగంలో రాష్ట్రంలో 75వ ర్యాంకు, జిల్లాలో 38వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆమె కమలాపురం బాలయోగి గురుకులం పాఠశాలలో పీజీటీ ఆంగ్ల అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. రమాదేవి అల్లాడుపల్లె సొసైటీ చైర్మన్ మార్తల నరసింహారెడ్డి సతీమణి. మెగా డిఎస్‌సిలో రమాదేవి ఉద్యోగం సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

'ఆటోమిత్ర'కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆటోమిత్ర పథకానికి సంబంధించి ఆర్థికసాయం పొందేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వాటర్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్, యాజమానులు 2025-26 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేలు సాయం అందించేందుకు మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. వాహన యాజమాని, లైసెన్స్ కలిగిన వ్యక్తి ఒకే కుటుంబానికి చెందిన వారై ఉండాలన్నారు. మోటర్ వెహికల్ కలిగి ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయినా వాహనమై, ఫిట్నెస్ సర్టిఫికెట్, మోటర్ వాహన టాక్స్ కలిగి ఉండాలన్నారు. ప్యాసింజర్ ఆటోరిక్షా దారులు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. ప్రతి దరఖాస్తుదారుడు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. దరఖాస్తుడి కుటుంబ సభ్యులు ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులై ఉండరాదన్నారు. ఆదాయ పన్ను చెల్లించేవారు అనర్హులుగా పేర్కొన్నారు. నెలకు 300 యూనిట్లు విద్యుత్ వినియోగించని వారై ఉండాలన్నారు. శానిటరీ పనిచేసే వారికి మినహాయింపు ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తడి పొలం మూడు ఎకరాలు, డ్రైలాండ్ పది ఎకరాలు, మున్సిపాలిటీ పరిధిలో 100 చదరపు మీటర్ల స్థలం ఉండే అభ్యర్థులు ఈ పథకానికి అనర్హులు అన్నారు. ఈ పథకానికి సంబంధించి అర్హత ఉన్న వారు ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ లోపు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24న జాబితా ప్రకటిస్తారని, అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం నగదును వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు.

మోడీ వ్యాఖ్యలు హాస్యాస్పదం

ప్రజాశక్తి - వేంపల్లె

దేశ వ్యతిరేక శక్తులకు కాంగ్రెస్ రక్షణ కల్పిస్తుందని, నెహ్రూ సర్కారు వల్ల దేశానికి కష్టాలు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించడం హాస్యాస్పదం, ఆక్షేపణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాధినేతలను దేశ పొలిమేరల నుండి తరిమికొట్టింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఆ సమయంలో నాయకత్వ వహించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఆకాశం మీద ఉమ్మి వేస్తే అది తిరిగి తమ ముఖం మీదనే పడుతుందనే సత్యాన్ని మోడీ, బిజెపి నాయకులు గ్రహిస్తే మంచిదని సూచించారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు డబుల్ ఇంజిన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ వెలిగిపోతుందని బిజెపి జాతీయ అధ్యక్షులు నడ్డా వ్యాఖ్యానించడం విడ్డూరమని తులసిరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆచరణలో ట్రబుల్ ఇంజిన్ గా తయారైందని ఆయన పేర్కొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు


ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీరాంనగర్ నగర్ ప్రాంతంలో తాగునీటి పైపులైన్ లీక్ కావడంతో పైతట్టు ప్రాంతాలకు తాగునీరు సరఫరా కాక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడేవారు. సమస్యను స్థానికులు సర్పంచ్ రాచిని శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆ మేరకు సోమవారం పంచాయతీ ఫిట్టర్ శివయ్య లీక్ అవుతున్న పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. పైతట్టు ప్రాంతాలకు తాగునీరు సరఫరా కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సర్పంచ్ ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేపట్టడం సంతోషంగా ఉందని సర్పంచ్, సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోపాటు క్రీడారంగంలోనూ సత్తా

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యతోపాటు క్రీడా రంగంలోనూ తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారని పెద్ద ముడియం ఎంఇఒ చింతకాయల చౌడయ్య పేర్కొన్నారు. కొట్టాలపల్లి హైస్కూల్లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్. కొట్టాలపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంతో కష్టపడి చదువుతూ మంచి మార్కులు సాధించడమే కాకుండా రాష్ట్ర స్థాయిలో టెన్నిస్ పోటీలకు 17 మంది, టేబుల్ టెన్నిస్ పోటీలకు 8 మంది విద్యార్థులు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ శివకుమార్, పీడీ పద్మజ, ఉపాధ్యాయులు, రాష్ట్రస్థాయి టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఇఒ

వాగులోపడి ఎద్దులు మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సుంకేసుల గ్రామ రైతు ఆదిరెడ్డికి చెందిన రెండు ఎద్దులు సోమవారం వాగులో పడి కొట్టుకుపోయి మృతి చెందాయి. స్థానికుల వివరాల మేరకు.. పొలం పనుల నిమిత్తం ఆదిరెడ్డి తుడుమలదిన్నె గ్రామ సమీప ప్రాంతానికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో వాగులో నీటి ఉధృతి ఎక్కువ కావడంతో ఎద్ల బండి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎద్దు రెండూ వాగులో నీట మునిగి మృతి చెందాయి. రైతు ఆదిరెడ్డి వాగులో నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. తనకు జీవనాధారం వ్యవసాయం ఎద్దులేనని ఆదిరెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నారు.

దయనీయం.. యానాదుల జీవితాలు

అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టదా.. ఆవేదన వెలుబుచ్చుతున్న యానాదులు



కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు, కర్రపైనే విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సాలమ్మ సత్రం వెనుక భాగాన నివాసముంటున్న దాదాపు 30 కుటుంబాల యానాదుల జీవితాలు దయనీయంగా ఉన్నాయి. వీరికి కనీస వసతులు లేవు.సరైన దారుల్లేవు. విద్యుత్‌దీపాలు పనిచేయవు. కనీసం తాగడానికి నీటి కుళాయిలు ఏర్పాటు చేయలేదు. వారు పింఛన్లకు కూడా నోచుకోలేదు. అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు వేస్తున్నారు. ఎక్కడైన సమస్య ఉంటే పట్టించుకుంటున్నారు.. తామేమి పాపం చేశామని యానాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పక్కా గృహాలు మంజూరు కాలేదన్నారు. తాము ఉండే ప్రాంతం చుట్టూ నిర్మానుషమని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. విష పురుగులు, అడవి పందులతో హడలిపోతున్నామని వాపోతున్నారు. ఓట్లకు ఉపయోగించుకుంటారే తప్ప, మా సమస్యలు తీర్చలేరా సార్..అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. సమస్యలు మీకు ఎలా చెప్పాలో కూడా తెలియడంలేదని ప్రజాప్రతినిధులు, అధికారులనుద్దేశించి పేర్కొంటున్నారు. మీ చుట్టూ తిరి గితే కడుపు కాల్చుకోవాల్సి వస్తుందని తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. 2005లో బ్రహ్మసాగర్ మునక ప్రాంతంగా జంగంరాజుపల్లి గ్రామాన్ని వీడి ఆస్తులు కోల్పోయామన్నారు. ప్రభుత్వం భూములు, ఇళ్ల ఇవ్వలేదన్నారు. న్యాయం చేయండి అంటూ ప్రభుత్వ కార్యాలయం, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమను బాధను అర్థం చేసుకుని కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని యానాదులు కోరుతున్నారు.



వితంతు పింఛన్‌కు నోచుకోని నర్సమ్మ

ప్రాణాలర్పించైనా ప్రయివేటీకరణను అడ్డుకుంటాం



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో ఇంద్రభవనం వంటి మెడికల్ కాలేజీని తమ ప్రభుత్వం నిర్మిస్తే.. కళ్లున్న కబోదిలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీని ఆయనతోపాటు డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మాజీ శాసన సభ్యులు ఎస్.రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పి.రామసుబ్బారెడ్డి, డిసి గోవిందరెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, పలువురు నాయకులు సందర్శించారు. కాలేజీ స్థితిగతులను సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మెడికల్ కాలజీ ఆవరణలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి. రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని తెలిపారు. అందుకు అవసరమైన నిధులను కూడా విడుదల చేసి భవనాలను పూర్తి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మెడికల్ కాలేజీలను ఎలా దోచుకోవాలో పిపిపి విధానంలో స్పష్టమైన జిఒ జారీ చేశారని విమర్శించారు. పిపిపి విధానాన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. తమ ప్రాణాలైనా అర్పించి పిపిపిని అడ్డుకుంటామని తెలిపారు. పేదలకు వైద్యం, వైద్య విద్యను దూరం చేయడానికి ప్రయివేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. కమీషన్ల కోసమే టిడిపి వారు ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. 75శాతం పూర్తయిన భవనాలకు, మిగిలిన వాటికి నిధులు కేటాయించి పూర్తిచేయడం చేతకాక పిపిపి పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే ప్రయివేటీకరణను రద్దు చేస్తామని తమ నాయకుడు చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుమ్మలపల్లె సర్పంచ్ అనూష మహేశ్వర్‌రెడ్డి, వేముల మండల నాయకులు నాగేళ్ల సాంబశివారెడ్డి, తుమ్మల గంగాధర్ రెడ్డి, తుమ్మల హేమంత్ రెడ్డి, వాల్మీకి నాయకులు నారాయణస్వామి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, పోరెడ్డి జస్వంత్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కంచర్ల సర్వోత్తమ్‌రెడ్డి, ఒత్తూరు రసూల్ పాల్గొన్నారు.

పేద విద్యార్థుల పొట్ట కొట్టడం దుర్మార్గం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు పేద విద్యార్థుల పొట్ట కొట్టడం చాలా దుర్మార్గమని వైసిపి బిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్లూరు సుదర్శన్ పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం చేయడం వల్ల ఎంబిబిఎస్ చదివేందుకు ఆశలు పెట్టుకున్న విద్యార్థుల కల నేరవేరదన్నారు. కూటమి నేతలు ప్రజలను మభ్య పెట్టేందుకు వైసిపిపై తప్పుడు ప్రచారాలు చేయడం మంచిది కాదన్నారు. సమావేశంలో జిల్లా యువజన విభాగం సభ్యుడు లక్ష్మిరెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి నాగరాజు, శ్రీకాంత్, పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా జెఎసి చైర్మన్ బర్నబాస్ కోరారు. ఆ మేరకు సోమవారం మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలతో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల కార్మికుల కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ దశలవారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తిగా వైద్య ఖర్చులు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న జిపిఎఫ్ కూడిన పెన్షన్ నిబంధనలు 1999 ఫిబ్రవరి 1 నుండి 2004 ఆగస్టు 31 వరకు నియమింపబడిన ఉద్యోగులందరికీ వర్తింపజేయాలన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. యూనియన్లతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పెండింగ్‌లో ఉన్న డిఎలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, డివిజన్ చైర్మన్ షరీఫ్, డివిజన్ కన్వీనర్ శివప్రసాద్, డివిజన్ వైస్ చైర్మన్ వెంకటరాముడు, డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వర్ బాషా పాల్గొన్నారు.

వేంపల్లె : విద్యుత్ శాఖలో పని చేస్తున్న పొరుగు సేవల సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేసి పనికి తగ్గ వేతనం ఇవ్వాలని జెఎసి చైర్మన్ పుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం విడతల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈనెల 17,18న ప్రధాన కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ధర్నా, 19,20 తేదీల్లో సర్కిల్ ప్రధాన కార్యాలయాల వద్ద రిలేనిరాహార దీక్షలు చేపడుతామన్నారు. 22న శాంతి ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు అబ్దుల్ సలీమ్, మల్లికార్జున, నాగేంద్ర ప్రసాద్, బాబావలి, నాగరాజు, లక్ష్మయ్య, రామచెన్నారెడ్డి పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

టివిఎస్ఎం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

మైదుకూరులోని టివిఎస్ఎం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఆ పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ సోమవారం డిప్యూటీ ఇఒ రాజగోపాల్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ తక్షణమే స్కూల్ గుర్తింపు రద్దు చేసి, కరస్పాండెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయని, ఇది విద్యా వ్యవస్థకే అవమానమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడం విచారకరమన్నారు. దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే జిల్లా, నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాహూల్, రాజశేఖర్‌రెడ్డి, పండు పాల్గొన్నారు.



డిప్యూటీ ఇఒ రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న ఎస్ఎఫ్ఐ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజామొద్దీన్ సూచించారు. సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆయన సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఖాజామొద్దీన్ మాట్లాడుతూ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రతిరోజు తమకు కేటాయించిన గృహాల్లో ఫీవర్, లార్వా సర్వే నిర్వహించాలన్నారు. జ్వరం ఉన్నట్లు అయితే వెంటనే రక్తపరీక్ష చేయించాలన్నారు. సింహాద్రిపురం వైద్యాధికారి డాక్టర్ కుమార్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : ప్రతి ఇంట్లో ఫీవర్, లార్వా సర్వే నిర్వహించాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజామొద్దీన్ తెలిపారు. సోమవారం నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన సూపర్‌వైజర్లకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో నల్లపురెడ్డిపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సూపర్‌వైజర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా బిల్లులు తప్పక తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

యూరియాను తీసుకువెళ్లే సమయంలో అందుకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎఒ దేవి పద్మలత రైతులకు సూచించారు. ప్రయివేట్ ఎరువుల దుకాణాలతోపాటు అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం సొసైటీలో ఎరువుల పంపిణీని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఎరువులు ఏ దుకాణంలో తీసుకున్నా వెంటనే రసీదు తీసుకోవాలన్నారు. ఆటోలు, ట్రాక్టర్లలో యూరియా ఇతర ఎరువులను సరఫరా చేసే సమయంలో తనిఖీలు నిర్వహిస్తే బిల్లులు లేకపోతే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. దుకాణ యజమానులు కూడా రైతులకు పాసు పుస్తకంలో ఎన్ని బస్తాలు ఇచ్చినది నమోదు చేసి, అవసరం మేరకు మాత్రమే యూరియా పంపిణీ చేయాలన్నారు. 30 మెట్రిక్ టన్నుల యూరియాను సోమవారం పంపిణీ చేశామన్నారు. దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతే జీవన ప్రగతికి సోపానం

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన పెంపొందించుకోవడం ద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని దువ్వూరు ఎపిజిబి మేనేజర్ నాగేశ్వర రావు పేర్కొన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవేర్నెస్‌పై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు సైబర్ క్రైమ్‌పై అవగాహన ఉండాలని సూచించారు. బ్యాంక్ అధికారులు ఎప్పటికీ ఖాతాదారుని ఫోన్ ద్వారా సంప్రదించి, ఓటీపీ, ఆధార్ నెంబర్లు అడగరని తెలిపారు. అవసరమైతే నేరుగా బ్యాంకులో సంప్రదించాలని ఖాతాదారులకు సమాచారం ఇస్తామన్నారు. విద్యార్థులు బ్యాంకు సేవలను సద్విని యోగపరచుకొని భవిష్యత్తులో ఉన్నతస్థితికి ఎదగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, హెర్డ్స్ సంస్థ అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిజిబి మేనేజర్ నాగేశ్వరరావు

సంబంధిత పత్రాల్లేకపోతే వాహనం సీజ్

వేంపల్లె : వాహనాలకు సరైన పత్రాలు లేకపోతే అలాంటి వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ తిరుపాల్ నాయక్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక రాయచోటి బైపాస్‌లో వాహనాలను ఎస్ఐ తనిఖీ చేశారు. సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు లేని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారందరూ సరైన రికార్డులు పెట్టుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

దాతల సహకారంతో అన్నదానం

చాపాడు : అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆలయ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ కోరారు. సోమవారం భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో పలువురు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లాడుపల్లె దేవళాలు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, దొంతు సుబ్రహ్మణ్యం, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పశువులకు టీకా వేస్తున్న వైద్యుల వాసా శ్రీనివాస

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించుకోవాలని వేల్పుచెర్ల, కొర్రపాడు పశు వైద్యాధికారులు వాసా శ్రీనివాస, భారతి సూచించారు. జాతీయ గాలికుంటు నివారణ కార్యక్రమంలో భాగంగా పశు వైద్యుల ఆధ్వర్యంలో సోమవారం వేల్పుచర్ల, కొర్రపాడు గ్రామాల్లో పశువులకు టీకా వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు పాడి రైతులు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో శకుంతలమ్మ, ధరణి, నాగమయ్య, శివ లింగేశ్వరరెడ్డి, నాగయ్య, వీరేంద్ర పాల్గొన్నారు.

బ్రేక్ ఫెయిలై రైల్వేగేటును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - ముద్దనూరు

సిమెంట్ లోడుతో వస్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో రైల్వే గేటున ఢీకొని ఆగిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన లారీ మైలవరం మండలం దాల్మియా సిమెంట్ కర్మాగారం నుంచి సిమెంట్ లోడుతో ముద్దనూరు మీదుగా కర్నాటకకు వెళుతోంది. సోమవారం తెల్లవారుజామున ముద్దనూరు ఘాట్ రోడ్డులోకి రాగా లారీ బ్రేక్ ఫెయిల్ అయింది. కొండ పై నుంచి డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరిస్తూ లారీ అదుపు చేస్తూ వచ్చాడ. దాదాపు 3కిలోమీటర్ల దూరంలో ఉన్న రైల్వేగేటును ఢీకొని ఆగిపోయింది. గేటు విరిగి పోయింది. ఆ సమయంలో రోడ్డుపై ప్రజలు, వాహనాలు తిరగకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దెబ్బతిన్న గేటును పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ సలాం తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక వేంపల్లి రోడ్డులో నివాసమున్న మల్లు కేశవరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి పరామర్శించారు. మల్లు కేశవరెడ్డి హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకొని ఇంటికి తిరిగివచ్చారు. విషయం తెలుసుకున్న సుధీర్‌రెడ్డి ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించినవారిలో జడ్పిటిసి తమ్మిశెట్టి బాలయ్య ఉన్నారు.

ప్రతి శుక్రవారం ఉచితంగా రాగి సంగటి

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నిరుపేదలకు ఉచితంగా ప్రతి శుక్రవారం రాగి సంగటి ముద్దను ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ తెలిపారు. సోమవారం ఉచితంగా రాగి సంగటి ముద్ద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారభించారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు రాగి సంగటి ముద్ద ఉచితంగా పెడుతున్నామన్నారు. వారంలో ఒక్క రోజు పేదలకు కడుపు నిండా అన్నం పెట్టాలనే ఉద్దేశంతో తన స్నేహితులైన కొయ్యల డిపో శ్రీను, అంజితో అందరూ కలిసి పేదలను ఆదుకోనేందుకు ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాగి ముద్ద సంగటితో పాటు పప్పు, చెట్నీ వేసున్నట్లు తెలిపారు. పేదలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

చేనేత రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అక్టోబర్ 6,7 తేదీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ కోరారు. ఆ మేరక సోమవారం కరపత్రాలను మైలవరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత రెండవ ప్రాధాన్యత కలిగిన రంగం చేనేత అన్నారు. మానవ సమాజానికి నాగరికత నేర్పిన చేనేత కార్మికులు నేడు పాలకుల అవలంభిస్తున్న కార్పొరేట్ విధానాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో పడిందన్నారు. ఆకలి చావులు, ఆత్మహత్యలకు బలవుతున్నారన్నారు. నమ్ముకున్న వృత్తిని వదుకోలేక.. మరో వృత్తిలోకి పోలేక దుర్భరస్థితిలో చేనేత కార్మికులు ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతన్నల సమస్యలపై జరగబోవు రాష్ట్ర మహాసభలో చర్చించి, భవిష్యత్తు పోరాటాలకు నాంది పలుకుతామన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, సంజీవరాయుడు, ముని మోహన్, నారాయణ పాల్గొన్నారు.

'మోక్షగుండం' జీవితం ఆదర్శం, స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితం ఆదర్శం, స్ఫూర్తిదాయకమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని సోమవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి, మహా మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, వెంకటేష్, బద్రీనాథ్, వేమయ్య, రాఘవయ్య పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా సోమవారం జేఎన్టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ప్రిన్సి పల్ డి.విష్ణువర్ధన్ విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపల్ కె.శేష మహేశ్వరమ్మ, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎం.సూర్యనారాయణరెడ్డి, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ జి.మురళి, మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు డాక్టర్ ఏ.దామోదర్‌రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు మురళి, మాధవరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : క్రమశిక్షణతో ప్రపంచ ప్రఖ్యాత ఇంజినీర్‌గా ఎదిగిన వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ప్రముఖ వైద్యులు డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు ప్రిన్సిపల్ గురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కళాశాల అధ్యాపకులు సురేంద్ర రెడ్డి, మంజునాథ్, వీరభద్రారెడ్డి, అశోక్‌బాబు, శీను, బాబు, విజయకుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.